# 10

# ఝుమ్రూ!

మాకు విహారయాత్రలంటే చాలా ఇష్టం. ఏకబిగిన ఆరు నెలలు ఇంట్లో ఉంటే అరికాళ్ళు దురద పెడతాయి. ఏదో ప్రయాణం పెట్టుకుంటాం.

విదేశాలకు వెళ్ళం. ఎంత తిరిగినా మనదేశంలోనే. మన భారత దేశం అంతా తిరిగి చూడాలంటేనే ఓ జీవితం చాలదు.

రాజస్థాన్ వెళ్ళాలనుకున్నాం. సామాన్యంగా టూర్ వెళ్ళాలంటే ప్రభుత్వం వారి పేకేజ్ టూర్ తీసుకుంటాం. అలా అయితే మనం ఎప్పుడు ఎక్కడికి వెళ్ళాలో, ఎక్కడ దిగాలో, ఏం తినాలో అన్నీ వాళ్ళే చూసుకుంటారు. మనం రికామిగా ఉండొచ్చు.

వైశాల్యపరంగా దేశంలోనే పెద్ద రాష్ట్రం రాజస్థాన్. జైపూర్, జోధ్‌పూర్, ఉదయ్‌పూర్, జైసల్మేర్ అన్ని చోట్లా బ్రహ్మాండమైన కోటలు. ఇన్ని కోటలూ, ఇంతమంది రాజులూ ఉంటే మరి వాళ్ళు పరిపాలించడానికి సరిపడా ప్రజలుండేవారా అని సందేహం వచ్చింది నాకు.

యాత్రలో భాగంగా జైసల్మేర్ చేరాం. పొద్దునపూట కోట చూశాం. సాయంత్రం సామ్ అనే చోటకి వెళ్ళాలిట. ఆ వివరాలన్నీ ముద్రించిన ఓ కరపత్రం ఇచ్చారు హోటల్ వాళ్ళు. మనం వెళ్ళబోయేచోటు ఎలా ఉంటుందో వివరాలన్నీ తెలుసుకుంటే... చాలా బావుంటుంది. గుడ్డిగా వెళ్ళిపోయి అక్కడ ఏబ్రాసి మొహం వేసే పరిస్థితి ఉండదు.

ఉత్సాహంగా ఆ పాంప్లేట్ చూశాను. ఎడారిలోని ఇసుకదిబ్బల ఫోటోలు చాలా బావున్నాయి.

తర్వాత సామ్‌ధనీ ప్రోగ్రాం గురించిన వివరాలు. సూర్యాస్తమయం కాగానే అక్కడికి వెళ్తే టీ, టిఫిన్ ఇస్తారుట. తర్వాత ప్రోగ్రాం ఉంటుందిట. వాటి వివరాలూ రాశారు. ఫోటోలు వేశారు.

అందులో ఓ అమ్మాయి పేరు ఝుమ్రూ. నల్లని దుస్తుల్లో చాలా అందంగా ఉంది. చాలా పేరున్న కళాకారిణిట. విదేశాలలో కూడా పర్యటించిందట. ఎంతోమంది పెద్దలూ, ప్రముఖులూ వేనోళ్ళ ప్రశంసించారుట ఝుమ్రూ ప్రతిభను. రెండు మూడు ఫోటోలు వేశారు. తెలియకుండానే ఆ అమ్మాయి డాన్స్ మీద ఎంతో ఆసక్తి కలిగింది. ఎప్పుడెప్పుడు చూస్తానా అనుకున్నాను.

రాత్రి డిన్నర్‌కి ఏమేం రాజస్థాన్ వంటలుంటాయో కూడా రాశారు. చదువుతుంటేనే నోరూరింది.

సాయంత్రం నాలుగింటికల్లా బయలుదేరాలి అని చెప్పారు. సూర్యాస్తమయం చూడ్డానికి నాలుగింటికి ఎండలో ఎందుకు బయలుదేరడం అని అడిగాం.

అక్కడి నించే పాతిక కిలోమీటర్లు కార్లో వెళ్ళాలిట. ఆ తర్వాత ఒంటెమీద గంట ప్రయాణమట.

భయంవేసింది మాకు. ఇంట్లో కాలు నిలవక దేశాటనం చేస్తున్నాం గానీ ఒంటెలూ, గుర్రాలూ ఎక్కే వయసా మాది? అసలే అంతంత మాత్రం నడుములు, ఏదైనా తేడావస్తే ఇక అంతే సంగతులు. ఎందుకొచ్చిన సాహసాలు తీరికూర్చునీ!

అందుకే ఒంటెలు మాత్రం ఎక్కం అని కచ్చితంగా చెప్పేశాం.

అయితే చక్కగా ఒంటె బండిమీద వెళ్ళండి అని ప్రత్యామ్నాయం సూచించారు. కాకపోతే ఒంటె కంటే బండికి వెళ్ళాలంటే ఇంకాస్త ఎక్కువ ఖర్చు అవుతుందన్నారు. ఒకసారి ఇల్లొదిలి బయలుదేరాక ఖర్చుకి వెనకాడం కదా! ఓ.కె. అన్నాం.

హోటల్లో భోజనం చేసాం. రూమ్‌కి వెళ్ళి ఓ రెండు గంటలు సుఖంగా నిద్రపోయాం. మూడింటికి బెల్‌కొట్టి టీ ఇచ్చారు.

మరో గంటలో బయలుదేరాలి. ఆలస్యం చేస్తే అక్కడ సూర్యాస్తమయం చూడలేరు అని హెచ్చరించాడు.

బయటికి వెళ్ళినప్పుడు బద్ధకించే అలవాటు లేదు మాకు. వాళ్ళు చెప్పిన టైముకి ఓ పదినిముషాలు ముందే రెడీ అయిపోయాం. రూం తాళం వేసి బయటికొచ్చాం. మా కోసం కారు సిద్ధంగా ఉంది. ఇంకా చాలా వాహనాలున్నాయి. అందరూ తయారై బయలుదేరుతున్నారు. కారెక్కాం. చక్కని తారురోడ్డు, ఇరు పక్కలా చెట్టూ చేమా ఏమీ లేని మైదానం. మట్టి బదులు ఇసుక, వింతగా ఉన్నాయి ఆ పరిసరాలు. వెళ్తుండగా ఎదురుగా బోలెడంతమంది జనం రోడ్డుమీద.

రాస్తారోకో ఏమో అని కంగారు పడ్డాం. కాదుట వాళ్ళంతా ఒంటెల వాళ్ళు. కారు అక్కడి దాకానే వెళ్తుందిట. ఇసుక దిబ్బల దగ్గరకు వెళ్ళాలంటే ఒంటెమీద వెళ్ళాల్సిందే. జైసల్మేర్ నించీ బయలుదేరిన వాహనాలన్నీ అక్కడే ఆగిపోతున్నాయి. అందరూ దిగి ఒంటెల వాళ్ళతో బేరం ఆడి వాటిమీదెక్కి వెళ్ళిపోతున్నారు. మేము బండికోసం వెయిట్ చేశాం. అరగంట తర్వాత వచ్చింది బండి. ఒంటె అంత ఎత్తుగా ఉన్నా బండి మాత్రం మన రిక్షా అంత ఎత్తులోనే ఉంది. టైర్లున్నాయి. తేలిగ్గానే ఎక్కి కూర్చొన్నాం.

బండివాడు పక్కన నడుస్తుంటే బయలుదేరింది బండి. చిన్నప్పుడు ఒంటెద్దు బండి ఎక్కాం. ఇప్పుడీ ఒంటె బండి అని సరదాపడ్డాం.

మోకాటిలోతు ఇసుకలో కాస్త ఆయాస పడుతూనే లాగుతోంది ఒంటె. ఇంకా నయం ఈ బండి సదుపాయం ఉండబట్టి బతికిపోయాం. లేకపోతే ఒంటె ఎక్కలేకా ఈ ఇసుకలో నడవలేకా అవస్థలు పడేవాళ్ళం అనుకున్నాం. దాదాపు గంట ప్రయాణం చేశాక గమ్యం చేరాం.

కనుచూపు మేరా ఇసుక దిబ్బలు. అంతంత ఎత్తున భలే బావున్నాయి. బండికి ఆరొందలు ఇచ్చేశాం. ఇసుక దిబ్బ ఎక్కి కూర్చున్నాం. అంతా సందడిగా ఉంది.

చిన్న ఆడపిల్లలు రాజస్థానీ దుస్తులు ధరించి యాత్రికుల దగ్గరికి వస్తున్నారు. వెంట తండ్రో, తాతో ఓ చిన్న డప్పు పుచ్చుకుని కూడా వున్నాడు. ఇద్దరూ కలిసి డ్యాన్సు చూడమని అడుగుతున్నారు. పాతిక రూపాయల దగ్గర మొదలుపెట్టి పది రూపాయలకి ఒప్పుకుంటున్నారు. మేము డబ్బులిచ్చి ఓ పిల్లడ్యాన్సు చూశాం. గిర్రున తిరుగుతూ ఆ వెంట ఉన్నతను డప్పు వాయిస్తూ పాడుతూ వుంటే డ్యాన్సు చేసింది. చిన్న పిల్ల తనకు తోచిన రీతిలో చేసిన ఆ డ్యాన్సు చూసి ఆనందించాం.

మగపిల్లలు మౌత్ ఆర్గన్ లాంటి ఓ చిన్న వాయిద్యం వినిపిస్తున్నారు డబ్బులు తీసుకునే. సూర్యుడు కిందికి దిగిపోతున్నాడు. జనం సందడి బాగా పెరిగింది.

గిర్రున తిరిగే ఈ ఆడపిల్లలు డ్యాన్సుల సందడి, మగపిల్లల వాయిద్యం ఆ నేపథ్యంలో ఇసుక మేటలకు దూరంగా సూర్యాస్తమయం. నయన మనోహరంగా ఉంది ఆ దృశ్యం. సూర్యాస్తమయం కాగానే అందరూ తిరుగు ముఖం పట్టారు. అప్పుడు గుర్తొచ్చింది మాకు. బండిని పంపించేశాం. ఎలా వెళ్తాం. మరో బండి దొరుకుతుందా? కంగారు వేసింది. మనవరాలివెంట తిరుగుతున్న ఓ పెద్దమనిషిని దొరకబుచ్చుకుని ఎలా వెళ్ళాలని అడిగాం. అటు వెళ్ళండి అని చెయ్యి చూపించాడు. ఆ ఇసుక దిబ్బలమీంచి దిగి మరో రెండు దిబ్బలు దాటుకుని ఓ వెయ్యి గజాలు నడిచాం. అంతే చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది. మా కారు అక్కడే ఉంది. మా కారొక్కటే కాదు. అన్ని వాహనాలూ అక్కడే ఉన్నాయి. మరి రోడ్డు ఇంతదగ్గర్లోనే ఉంటే మమ్మల్ని అక్కడెక్కడో దింపి ఒంటె బండిమీద ఎందుకు వూరేగించారూ! అదీ బోలెడు డబ్బు తీసుకునీ!

డ్రైవర్ని అడిగితే నవ్వేశాడు. "కార్లో ఎప్పుడూ తిరుగుతూనే ఉంటారు కదా! కొత్త అనుభవం కలిగించాలని అలా చేశాం" అన్నాడు.

నాకొళ్ళు మండిపోయింది. "ఆ మాట స్పష్టంగా చెప్పాలి. ఆ అనుభవం కావాలనుకున్న వాళ్ళు ఒంటె లెక్కుతారు" అని అడిగితే...

"అలా ఛాయిస్ ఇస్తే ఒంటెలెవరూ ఎక్కరు. మరి ఒంటెలను నమ్ముకున్న వాళ్ళు ఏమైపోవాలి?" అన్నాడు.

అదీ నిజమే. ఎవరి తాపత్రయం వాళ్ళదీ. ఎన్ని వేషాలేస్తే వెళ్ళమారుతుందీ జీవితం? అక్కడ కారెక్కి అరకిలోమీటరు దూరంలో ఉన్న ఓ చోటికి వెళ్ళాం. బాగా ఎత్తులో ఉంది ఆ ప్రదేశం! రెండు చిన్న బిల్డింగులున్నాయి. పక్కనే టెంట్లు. సీజన్‌లో చాలామంది వస్తారుట. అవన్నీ నిండిపోతాయిట.

వెళ్ళగానే అటుకుల ఉప్మాపెట్టి టీ ఇచ్చారు. ఇంకాసేపట్లో ప్రోగ్రాం మొదలవుతుంది అన్నారు. ఆరుబయట గుండ్రని మట్టి అరుగు. చక్కగా అలికి ముగ్గులు పెట్టారు. చుట్టూ కుర్చీలు వేశారు. అందరం కూర్చున్నాం. వాతావరణం చల్లగా, హాయిగా ఉంది.

ప్రోగ్రాం మొదలయింది. ముందుగా ఇన్‌షర్ట్ టైతో ఉన్న ఒకతను వచ్చి స్వాగత వచనాలు పలికాడు. "ఇప్పుడు మీరు అద్భుతమైన జానపద కళలు చూడబోతున్నారు. ఇందులో పాల్గొనే కళాకారులందరూ దేశంలోనే కాక విదేశాల్లోనూ ఎన్నో ప్రదర్శనలిచ్చినవారు. చాలా పేరు ప్రఖ్యాతులు గడించినవారు. ఈనాటి ఈ కార్యక్రమం మీకు మరచిపోలేని మధురానుభూతిగా మిగిలిపోతుంది అన్నాడు". అతను అక్కడ మేనేజరుగా పనిచేస్తున్నాడుట.

ఇలాంటి మాటలు ఎన్నో విన్నాం. కాస్త వుంటే గంపంత చేసి చెప్తారు.

అతని మాటల్లో ఆవంతైనా అతిశయోక్తిలేదని ప్రోగ్రాం ప్రారంభమైన కొద్దిసేపటికే తెలిసిపోయింది. పదిమంది యువకులు తెల్లని కుర్తా పైజామా వేసుకుని తలకి రంగురంగుల తలపాగా ధరించి అర్ధచంద్రాకారంలో కూర్చున్నారు. హార్మనీ, తబలా ఉన్నాయి ఇద్దరి ముందు. మిగిలిన వాళ్ళంతా రెండు చేతుల్లోనూ పేకముక్క సైజులో ఉన్న చెక్కముక్కలు పట్టుకున్నారు. పాట ప్రారంభం అయింది. ఆ చెక్కముక్కలను లాఘవంగా తిప్పుతూ శబ్దం చేస్తున్నారు. ఎంతో వైవిధ్యం! ఏం సమన్వయం! ఎంతటి ప్రతిభ! ఆ కళను చూసి విభ్రాంతికి లోనైపోయాం.

దాదాపు ఇరవై నిముషాలపాటు జరిగిందా కార్యక్రమం. ఎంతగా లీనమైపోయామంటే పూర్తయ్యాక చప్పట్లు కొట్టాలనే విషయం కూడా మర్చిపోయాం.

కాసేపటికి స్పృహలోకొచ్చిన కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. మేనేజర్ కమ్ ఎనౌన్సర్ వచ్చాడు.

"చూశారా! మరీ! ఇప్పుడింకో పాట" అన్నాడు. ఆ పాట కూడా చాలా చాలా బావుంది.

తర్వాత కార్యక్రమం నృత్యం. "వైవిధ్య భరితమైన నృత్యంతో నీ ముందుకి వస్తోంది ఈ కళాకారిణి. ఈమె పేరు ఝుమ్రూ. ఈమె ఫ్రాన్స్ ఫెస్టివల్‌కి వెళ్ళారు. ప్రత్యేక ఆహ్వానం మీద ఇంకా ఎన్నో దేశాలలో పర్యటించారు. వేల వేల ప్రోగ్రాంలు ఇచ్చారు. ఈమె ప్రతిభ అనన్య సామాన్యం" అన్నాడు.

నేను ఎంతగానో ఎదురుచూస్తున్న ఝుమ్రూ మా ముందుకి వచ్చింది. ఫోటోలో కంటే ఇంకా అందంగా ఉంది. నల్లటి డ్రెస్ మీద కుట్టిన అద్దాలు మెరిసిపోతున్నాయి. పాటకు అనుగుణంగా చక్కగా డేన్స్ చేస్తోంది. ఆ హావభావాలూ, ఆ కదలికలూ

చాలా బావున్నాయి. కాసేపు మామూలుగా డేన్స్ చేసిన తర్వాత అసలు ఘట్టం ఆరంభం అయింది.

అనౌన్సర్ "ఇప్పుడు చూడండి. ఝుమ్రూ కంటి రెప్పతో సూదిని తీస్తుంది. మువ్వని తీస్తుంది" అని పక్కనించీ మైక్‌లో అనౌన్స్ చేశాడు.

ఒక చిన్న పీటమీద గుప్పెడు ఇసుక పోసి దానిలో సూదిని గుచ్చారు. ఆ పీటవైపు వీపు పెట్టి నిలబడిన ఝుమ్రూ విల్లులా వెనక్కి వంగి ఆ సూదిని కనురెప్పతో పట్టుకుని లేచి నిలబడింది. నాకు భయం వేసి కళ్ళు మూసుకున్నా. ఏ మాత్రం అటూ ఇటూ అయినా కన్నుపోతుంది. తర్వాత సూది స్థానంలో మువ్వని పెట్టారు. అదీ సునాయాసంగా తీసింది.

గాజు పెంకులు కిందపోశారు.

ఇప్పుడు చూడండి. ఈ అద్భుతమైన నృత్యం అని అనౌన్స్ చేశాడతను. నెత్తిన మూడు కుండలు ఒకదానిమీద ఒకటి నిలబెట్టి ఆ గాజు పెంకులమీద నెమలిలా నాట్యం చేసింది ఝుమ్రూ. నాట్యం ముగియగానే అంతా లేచి నిలబడి చప్పట్లు కొట్టాం.

ఆఖరున అందరూ కలిసి ఒక పాట పాడారు. వచ్చిన అతిథులను అభినందిస్తూ పాడిన ఆ పాట అద్భుతంగా ఉంది. ఆ కార్యక్రమం ముగిసింది. మరికాసేపట్లో డిన్నర్ సర్వ్ చేస్తాం అన్నారు. అందరం లేచి అటూ ఇటూ తిరగడం మొదలు పెట్టాం. అలా నడుచుకుంటూ చివరికి వెళ్ళాను. మసక వెన్నెల్లో అద్భుతంగా ఉంది ప్రకృతి. చిన్న అలికిడి. వెనక్కి తిరిగి చూస్తే ఝుమ్రూ. నా ఒళ్ళు పులకరించింది.

వినయంగా నమస్కరించాను. ఏడాది వయసున్న పిల్లవాడిని ఎత్తుకుంది. మీతో ఓ ఫోటో తీసుకోవచ్చా అని సంకోచిస్తూనే అడిగాను. చిరునవ్వుతో తలూపింది. వెంటనే కెమెరా సెట్ చేసి అటుగా వెళ్తున్న ఒకావిడని అడిగి ఝుమ్రూ పక్కన నిలబడి ఫోటో తీయించుకున్నా.

మీ అబ్బాయా? అని అడిగా. అవును అంది. పేరేమిటి అంటే అసోక్ అంది. ఆ పిల్లవాడి చేతిని నా చేతుల్లోకి తీసుకుని ఉలిక్కిపడి వెంటనే వదిలేశా మాడిపోతోంది.

నేను వదిలేసిన ఆ బిడ్డ చేతిని తన చేతిలోకి తీసుకుని నా ముందుకు చాచింది.

"మాజీ అసోక్‌కో గిఫట్‌దో!" అంది దీనంగా.

కడుపులో దేవినట్లు అయింది నాకు. నేను తప్పుగా విన్నానా అని అనుమానం వేసింది. "మాజీ! ఎంతో కొంత ఇవ్వవా? అసోక్‌కి జ్వరం!" నీళ్ళు నిండిన కళ్ళతో దీనంగా అడిగింది.

ఎంతో ఎత్తున ఊహించుకున్న ఆ కళాకారిణి నిజస్వరూపంతో ప్రత్యక్షం అయ్యేసరికి ఎవరో గుండెమీద బలంగా గుద్దినట్లు అయింది.

పర్స్ తెరిచి చేతికి అందిన నోటు తీసి ఆ బిడ్డ చేతిలో పెట్టాను. ఇంకొక్క క్షణం అక్కడ ఉండబుద్ధి కాలేదు. వచ్చేస్తుంటే పిలిచి ఝుమ్రూ... "మాజీ ఇలా అడిగానని వాళ్ళతో చెప్పకండి! టూరిస్టుల దగ్గర అడుక్కుంటున్నావని తిడతారు. ప్రోగ్రాంలకి పిలవరు" దీనంగా అర్థించింది. ఆ మాట తీరు, ఆ యాస చూస్తే ఝుమ్రూ ఏమీ చదువుకోలేదని అర్థం అయిపోతోంది.

తలూపి అక్కడి నించీ వచ్చేశా. డిన్నర్ రెడీ అని పిలుపు వచ్చింది. ఆకలి చచ్చిపోయింది. తినాలని లేదు. కానీ తినకపోతే అందరికీ సంజాయిషీ ఇచ్చుకోవాలి. అంత ఓపిక లేదు. ఏదో కాస్త వడ్డించుకున్నా. అందరూ ఇందాకటి ప్రోగ్రాం గురించీ, ఝుమ్రూ గురించీ మాట్లాడుకుంటున్నారు. వినలేక అక్కడినించీ దూరంగా వెళ్ళిపోయా.

పక్కన సందడి. వాదోపవాదాలు. అటు వెళ్ళి చూశా. ఒక డొక్కు జీప్ ఉంది. దాని దగ్గర నిలబడి ఉన్నారు ఇందాకటి కళాకారులు. వాళ్ళ ఎదురుగా ఇందాక వాళ్ళని ఆకాశానికి ఎత్తేసిన అనౌన్సర్ కమ్ మేనేజర్. పేమెంట్ విషయంలో వాదించుకుంటున్నారు.

ఎన్నో రోజుల నించీ ఇంతే ఇస్తున్నారు. ధరలు పెరిగాయి. ఎలా బతుకుతాం. మరికాస్త పెంచకూడదా అంటారు వాళ్ళు.

ఇదే ఎక్కువ. ఇష్టంలేకపోతే రాకండి. వేరే వాళ్ళను పిలుస్తాను. రోజూ ఇదే తలనెప్పి నాకు అని విసుక్కున్నాడు ఇతను.

అలా అనకు సాబ్ అని రాజీపడి ఇచ్చినంతే తీసుకున్నారు. పదండి పదండి అని తొందర పెట్టాడు.

"ఇంకాసేపుంటే అతిథుల భోజనాలు అయిపోతాయి. ఏమైనా మిగిలితే మాకు పెడతారుగా" ఆశగా అడిగింది ఝుమ్రూ.

"సర్లే మిమ్మల్ని దించి మళ్ళీ రావాలి జీప్ మా కోసం. ఏదైనా పెద్ద ఫంక్షనుంటే చాలామంది వస్తారు. మిగుల్తాయి. ఇవాళేం మిగలవు. లెక్కగా చేయించాం. పదండి" అని కసిరి జీప్ ఎక్కించాడు. కాదు కూరేశాడు.

లారీలో కబేళాకి తరలించబడే పశువుల్లా సైకిలు హేండిల్‌కి తలకిందులుగా వేలాడదీసిన కోళ్ళలాగా దీనంగా నిస్సహాయంగా ఆ డొక్కు జీప్‌లో ఇరుక్కుని కూర్చుని బయలు దేరారు ఆ మహాకళాకారులు. వెనక తలుపుమీద కాళ్ళిటు పెట్టి బిడ్డని గుండెకి ఆనించుకుని బ్రేక్ వేస్తే పడుతుందేమో అనేలా కూర్చుంది ఝుమ్రూ. నాకు ఏడుపొచ్చేసింది.

ఈ కార్యక్రమం మరుపురాని అనుభూతిగా మిగిలిపోతుందని ఆ మేనేజర్ చెప్పిన మాట అక్షరాల నిజమే. కాకపోతే కాస్త తేడా ఉంది. అది మధురానుభూతి కాదు. చేదు అనుభవం. ❑

*ఆంధ్రభూమి దినపత్రిక, 28 మే 2011*